క్లుప్తంగా

సీసీ కెమెరాల నిఘాలో పోలింగ్ కేంద్రాలు

మఠంపల్లి : మండలంలోని 29 గ్రామపంచాయతీల పరిధిలోని పాఠశాలలు, పంచాయతీ భవనాలు, ఇతర ప్రభుత్వ భవనాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు సీసీ కెమెరాల నిఘాలో ఉంచుతున్నట్లు ఎంపీడీఓ ఎం.జానకిరాములు తెలిపారు. బుధవారం ఆయన మండలంలోపి పలు కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గల 45 పోలింగ్ కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు, రెండు, మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

హుజూర్‌నగర్ : విద్యార్థులు చదువుతో పాటు వివిధ అంశాలపై నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చందా అప్పారావు అన్నారు. పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్‌లో నాసా ప్రాజెక్టు చేయనున్న విద్యార్థులకు బుధవారం కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో నైపుణ్యం ఉన్నవారికి మంచి అవకాశాలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మాలధారుల ఇరుముడి మహోత్సవం



ఇరుముడులు ధరించి శబరికి వెళ్తున్న అయప్ప మాలధారులు

చిలుకూరు : మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో గల వీరాంజనేయస్వామి దేవాలయంలో బుధవారం అయప్ప మాలధారుల ఇరుముడి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 41 రోజుల పాటు అయప్ప దీక్షలో ఉన్న స్వాములు ఇరుముడులు ధరించి శబరికి బయలుదేరి వెళ్లారు.

నర్సరీల పరిశీలన




బక్కమంతులగూడెంలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ జానకిరాములు

మఠంపల్లి : మండలంలోని 29 గ్రామపంచాయతీల్లో గల నర్సరీల్లో 2 లక్షల మొక్కలను పెంచుతున్నట్లు ఎంపీడీఓ జానకిరాములు తెలిపారు. బుధవారం మండలంలోని బక్కమంతులగూడెం, చౌటపల్లి, అల్లీపురం తదితర గ్రామాల్లో గల నర్సరీలను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు నరేందర్‌రెడ్డి, మౌనిక, కవిత, వన సేవకులు తదితరులు ఉన్నారు.

స్వతంత్ర అభ్యర్థి ప్రచారం

చిలుకూరు : కోదాడ అసెంబ్లీ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి బెల్లంకొండ నవీన్‌గౌడ్ బుధవారం చిలుకూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డోర్ బెల్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ఓటర్లను కోరారు.

ప్రజా సమస్యలపై పోరాడే అభ్యర్థిని గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమ

హుజూర్‌నగర్ : ప్రజా సమస్యలపై పోరాడే అభ్యర్థినే ఎన్నికల్లో గెలిపించుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమ అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన సీఐటీయూ అనుబంధ కార్మిక సంఘాల జనరల్ బాడీ సమావేశంలో ఆమె మాట్లాడారు. డబ్బుల కోసం అమ్ముడు పోయే నాయకులు ఒక పక్క ఉంటే కార్మిక, ప్రజా సమస్యల మీద పోరాడే వారు ఒకవైపు ఉన్నారన్నారు. సీఐటీయూ బలపరిచిన సీపీఎం అభ్యర్థిని మ ల్లు లక్ష్మిని గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సీపీఎం అభ్యర్థి మల్లు లక్ష్మి, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, సీఐటీయూ నాయకులు ఎం.రాంబాబు ఎస్.వెంకటేశ్వర్లు, శీలం శ్రీను, సోమయ్య, ఏక లక్ష్మి, సైదులు, యాకుబ్, రామ్మూర్తి, వరలక్ష్మి, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సైదిరెడ్డిపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు గట్టు శ్రీకాంత్ రెడ్డి, వేముల శేఖర్‌రెడ్డి, మంద వెంకటేశ్వర్లు కోరారు. ఈమేరకు బుధవారం హుజూర్‌నగర్ సీఐ రామలింగారెడ్డికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించి అసత్య ఆరోపణలు చేస్తున్న వారిపై వారి అనుచరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

ముదిరాజ్‌లకు అన్యాయం చేసిన బీఆర్‌ఎస్

- హుజూర్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్ : రాష్ట్రంలో అతిపెద్ద సామాజిక వర్గం అయిన ముదిరాజ్‌లకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం గత మూడేళ్లుగా మంత్రి వర్గంలో స్థానం లేకుండా చేసి వారికి అన్యాయం చేసిందని హుజూర్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో పట్టణానికి చెందిన పిట్టల ముదిరాజ్‌తో పాటు మరో 400 కుటుంబాలు, తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు పానుగంటి వెంకన్న ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఉత్తమ్ మాట్లాడుతూ 119 అసెంబ్లీ సీట్లలో ముదిరాజ్‌లకు ఒక్క స్థానం కూడా ఇవ్వలేదని తెలిపారు. ఈ విషయంపై ముదిరాజ్‌లు ఆలోచన చేసి ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు తగిన బుద్ధి చెప్పాలని, చేయి గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పట్టణంలో ముదిరాజ్‌భవన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. హుజూర్‌నగర్‌లో రౌడీజం, గుండాగిరి చేసేవారు ఎక్కువ అవుతున్నారన్నారు. సర్వే కన్సల్‌టెంట్ బండి రామస్వామిని ఎమ్మెల్యే కిడ్నాప్ చేసి సె ల్‌ఫోన్ దొంగిలించారని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గెల్లి రవి, తన్నీరు మల్లికార్జున్, శ్రీనివాస్, సంపత్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

'గ్యారంటీ'లపై విస్తృతంగా ప్రచారం చేయాలి

హుజూర్‌నగర్ : కాంగెస్ ఆరు గ్యారంటీ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని ఎంపీ ఉత్తమ్



హుజూర్‌నగర్ : సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో మేళ్లచెరువులోని ఎస్సీ కాలనీకి చెందిన పలువురు యాంపగు గురుస్వామి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరా రు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కాకునూరి భాస్కర్‌రెడ్డి, నాయకులు సైదేశ్వరరావు, గోవిందరెడ్డి, రాంచందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు

గోపాలపురంనకు చెందిన బుడిగ జంగాల నాయకులు పస్తం సాంబయ్య, పస్తం హుస్సేన్ తన అనుచరులతో కలిసి బుధవారం ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ శాసనాల నాగసైదయ్య, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు వెలిశెట్టి బ్రహ్మం, సోమయ్య, ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు గురవయ్య, నాయకులు పాల్గొన్నారు.

కోదాడలో కాంగ్రెస్ పార్టీదే గెలుపు

కోదాడ: అధికార పార్టీ ఎన్ని ప్రలోభాలు పెట్టినా, ఆ పార్టీ నాయకులు డబ్బు సంచులతో దిగినా కోదాడలో కాంగ్రెస్ గెలుపును ఎవరూ ఆపలేరని,



పాలకవీడు : ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు

50 వేల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతిరెడ్డి గెలువబోతున్నారని నల్గొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం కోదాడలో జరిగిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ సంఘాల అధ్యక్షుడు పంది తిరపతయ్య ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ నాయకులు ఏర్నేని బా బు, కేఎల్‌ఎన్ ప్రసాద్, కాంపాటి శ్రీను పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, సీపీఎంల నుంచి కాంగ్రెస్‌లోకి..

పాలకవీడు : మండలంలోని దేవ్లాతండా, మహంకాళిగూడెం, బెట్టెతండా గ్రామాల్లో బీఆర్‌ఎస్, సీపీఎం పార్టీలకు చెందిన పలువురు హుజూర్‌నగర్‌లోని పార్టీ క్యాంపు కార్యాలయంలో ఎంపీపీ గోపాల్, మోతీలాల్ ఆధ్వర్యంలో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎస్‌వీ సుబ్బారావు, నర్సింహారావు, సుమన్, కోట్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరిస్తా

- కోదాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడఅర్బన్ : న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి కృషిచేస్తానని కోదాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. బుధవారం తన ప్రచారంలో భాగంగా కోదాడ బార్ అసోసియేషన్ సభ్యులతో వారి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోదాడ ప్రాంతానికి అర్హత ప్రకారం రావాల్సిన కోర్టుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. న్యాయవాదులలో పేద వారికి ఇళ్ల స్థలాలు ఇప్పించి గృహలక్ష్మి పథకం కింద ఇంటి నిర్మాణానికి ఆర్థికసాయం అందిస్తానన్నారు. జూనియర్ న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగార్జున, శరత్‌బాబు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో సమావేశం

పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో బుధవారం బీఆర్‌ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. కరోనా సమయంలో సీఆర్ ప్రభుత్వం ప్రైవే టు ఉపాధ్యాయులకు కరోనా భృతి ఇచ్చినట్లు గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ తిరిగి అధికారంలోకి రాగానే టీచ ర్ నియామక ప్రక్రియ ప్రారంభిస్తుందని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కోదాడఅర్బన్ : న్యాయవాదుల సమావేశంలో మాట్లాడుతున్న బొల్లం మల్లయ్యయాదవ్



నడిగూడెం : మల్లయ్యయాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న చాకిరాల నాయకులు

బీఆర్‌ఎస్‌లో చేరికలు

నడిగూడెం : మండలంలోని చాకిరాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ రాంపల్లి బుచ్చిమల్లు బుధవారం ఆయన వర్గీయులతో బీఆర్‌ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కాగా, ఈ నెల 21న తన వర్గీయులతో కోదాడ కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వారు తిరిగి మల్లయ్యయాదవ్ సమక్షంలో సొంతగూటికి చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ యాతాకుల వీరస్వామి, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు వఫిరోజ్, బొందయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందని ఇల్లు లేదు

- హుజూర్‌నగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని ఇల్లు లేదని హుజూర్‌నగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మేళ్లచెరువు మండలం రేవూరు వార్డు సభ్యుడు, మైనార్టీ నాయకుడు జానిమియాతో పాటు 20 కుటుంబాలు, గరిడేపల్లి, నేరేడుచర్ల వైఎస్సార్‌టీపీ అధ్యక్షులు కొనతం రామిరెడ్డి, కుక్కడపు ఉపేందర్, మరో 18 కుటుంబాల వారు సైదిరెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అదేవిధంగా మేళ్లచెరువుకు చెందిన శివాలయ మాజీ ధర్మకర్త టి.శ్రీనివాసాచారి, చింతలపాలెం మండలంలో వైఎస్సార్‌టీపీకి చెందిన 12 కుటుంబాల వారు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఇమ్రాన్, మాశెట్టి రాముడు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓడిపోతాననే భయంతో చిల్లర రాజకీయాలు

హుజూర్‌నగర్ : ప్రస్తుత ఎన్నికల్లో ఓడిపోతాననే భయంతో కొందరు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని హుజూర్‌నగర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం అర్ధరాత్రి జరిగిన కిడ్నాప్ హైడ్రామా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి క్రియేట్ చేసిందేనని ఆరోపించారు. సర్వే ఏజెన్సీకి చెందిన రామస్వామి అనే వ్యక్తి తమ దగ్గర పని చేశాడని, అతనే తమ ఆఫీస్ వద్దకు వచ్చి మాట్లాడి వెళ్లడం జరిగిందని చెప్పారు. దాన్ని ఏదో మసిబూసి మారేడు కాయ



హుజూర్‌నగర్ : గులాబీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న సైదిరెడ్డి



మేళ్లచెరువు : ప్రచారంలో పలువురిని బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న పార్టీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి

చేసే విధంగా కిడ్నాప్ అనే కొత్త రకం వ్యవహారాన్ని తెరపైకి తెచ్చారని ఆయన అన్నారు.

అభివృద్ధి చేశా.. మరోసారి గెలిపించండి

మేళ్లచెరువు : నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని, మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని బీఆర్‌ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కందిబండ, వెల్లటూరు, మేళ్లచెరువు గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో పలువురు ఆయన సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు భిసవయ్య, రవిందర్‌రెడ్డి, రుక్కయ్య యాదవ్, శంకర్‌రెడ్డి, గురవయ్య, జక్కుల వీరయ్య యాదవ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్ రోడ్‌షోను విజయవంతం చేయాలి

హుజూర్‌నగర్ : అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ గురువారం హుజూర్‌నగర్‌లో రోడ్‌షోలో పాల్గొంటారని హుజూర్‌నగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి శానంపూడి సైది రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో అభివృద్ధికి సహకరించిన మంత్రి కేటీఆర్‌కు బీఆర్‌ఎస్ శ్రేణులు భారీ స్థాయిలో స్వాగతం పలికి, రోడ్‌షోను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

గెలిపిస్తే కోదాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

- కోదాడ కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి

మునగాల : అసెంబ్లీ ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపిస్తే కోదాడను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని కోదాడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నలమాద పద్మావతి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మండలంలోని జగన్నాథపురం, కలకోవ, గణపవరం, తిమ్మారెడ్డిగూడెం, కొక్కిరేణి, బరాఖత్ గూడెం, ముకుందాపురం గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఆయా గ్రామాల్లో పద్మావతికి మహిళలు తిలకం దిద్ది మంగళహారతితో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పద్మావతి మాట్లాడారు. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో పేదోడి సొంతింటి కల నేరవేరలేదన్నారు. సీఎం కేసీఆర్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు, స్థానిక ఎమ్మెల్యే సైతం కోట్ల రూపాయలు వెచ్చించి ఇంద్రభవనం లాంటి ఇళ్లు కట్టుకున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్‌ఎస్ పార్టీకి వీఆర్‌ఎస్ రానున్నదని, కాంగ్రెస్ పార్టీయే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. ఉత్తమ్‌తో పాటు తనను బీఆర్‌ఎస్ నాయకులు టూరిస్టులని అనడం విడ్డూరంగా ఉందని, తమకు రెండు నియోజకవర్గాలు రెండు కళ్ల లాంటివని తెలిపారు. ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చామని, తమపై ఏనాడు అవినీతి ఆరోపణలు వచ్చిన దాఖలాలు లేవన్నారు. కాంగ్రెస్‌కు అత్యధిక మెజార్టీ వచ్చే విధంగా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కోదాడ నియోజకవర్గ నాయకులు పందిరి నాగిరెడ్డి,



మునగాల : గణపవరంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి

సామినేని ప్రమీల, ఎంపీపీ ఎలక బిందు, వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య, మండల నాయకులు నల్లపాటి శ్రీనివాస్, ఎలక నరేందర్‌రెడ్డి, ఉప్పుల జానకిరెడ్డి, కేతిరెడ్డి మోహన్‌రెడ్డి, కొప్పుల జైపాల్ రెడ్డి, వేనేపల్లి వీరబాబు, అమరబోయిన మట్టయ్య యాదవ్, ఎర్రం శ్రీనివాసరెడ్డి, వీరరాఘవరెడ్డి, కొక్కిరేణి ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, ఒరుగంటి రవి, బోళ్ల వెంకటరెడ్డి, సామియేలు, అశోక్, గ్రామశాఖల అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పద్మావతిని గెలిపించాలి

చిలుకూరు : మండల వ్యాప్తంగా బుధవారం కాంగ్రెస్, సీపీఐ పార్టీల నాయకులు కోదాడ కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతిని గెలిపించాలని కోరుతూ ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ బండ్ల ప్రశాంతికోటయ్య, జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీషానాగేంద్రబాబు, కాంగ్రెస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కీత వెంకటేశ్వర్లు, పిండ్రాతి హనుమంతరావు, సర్పంచ్ వట్టికూటి చంద్రకళ నాగయ్య, ఎంపీటీసీలు సైదాబాబు, ధనమూర్తి, కాంగ్రెస్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

కోదాడరూరల్ : కోదాడ మండలంలోని కూచిపూడిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పేద ప్రజల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మందలపు శేషు, శెట్టి విజయ్‌భాస్కర్, పూర్ణ, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



కోదాడరూరల్ : ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరిస్తున్న కాంగ్రెస్ నాయకులు



చిలుకూరు : బేతవోలులో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్, సీపీఐ నాయకులు

కేటీఆర్‌కు జూలూరి స్వాగతం



కోదాడలో హెలిపాడ్ వద్ద మంత్రి కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

- డీఎస్పీ ప్రకాష్

హుజూర్‌నగర్ : (చింతలపాలెం) : అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరైనా గొడవలు సృష్టించి, అల్లర్లకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని కోదాడ డీఎస్పీ ప్రకాష్ అన్నారు. బుధవారం చింతలపాలెం మండలంలోని కిష్టాపురం, పీక్లాయక్‌తండాలో గ్రామస్తులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనవసరమైన గొడవల్లో తలదూర్చి కేసుల్లో ఇరుక్కోవద్దని సూచించారు. గ్రామస్తులు శాంతి సామరస్యాలతో మెలగాలని ఆయన చెప్పారు. ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా జరిగేందుకు గ్రామస్తులు సహకరించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రకాష్

కార్యక్రమంలో సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ సైదిరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ కమలాకర్, ఐటీబీఎఫ్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కిడ్నాప్ చేయడానికి యత్నించారు

- సర్వే టీం సభ్యుల ఆరోపణ

హుజూర్‌నగర్ : ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దగ్గర పనిచేస్తున్న తమను ఎమ్మెల్యే సైదిరెడ్డి కిడ్నాప్ చేయడానికి యత్నించారని సర్వే టీం సభ్యులు బండి రామస్వామి, వింజమూరి సృజన ఆరోపించారు. బుధవారం పట్టణంలోని టౌన్ హాల్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే తమను కిడ్నాప్ యత్నం చేయడమే కాకుండా బెదిరించారని, తమ సెల్ ఫోన్ లాక్కుని ఇప్పటివరకు ఇవ్వలేదని చెప్పారు. ఈ విషయం తెలిసి ఉత్తమ్ తమకు సహకరించారని ఆయన సహకారంతో కిడ్నాప్ విషయమై



విలేకరులతో మాట్లాడుతున్న సర్వే టీం సభ్యులు

పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్యేపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఎమ్మెల్యే కోసం తాము చేసిన పనికి డబ్బులు ఇపించాలని వారు కోరారు.

నేరేడుచర్ల ఎంపీడీఓ ఇంట్లో చోరీ

- బంగారం, వెండి, నగదు అపహరణ

నేరేడుచర్ల : గుర్తుతెలియని వ్యక్తులు నేరేడుచర్ల మండల అభివృద్ధి అధికారి ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రంలోని అంజలి స్కూల్ సమీపంలో నివాసం ఉంటున్న నేరేడుచర్ల ఎంపీడీఓ శంకరయ్య-శ్రవంతిలు ఈనెల 18న ఇంటికి తాళం వేసి స్వగ్రామం నల్లగొండ జిల్లా నకిరేకల్‌కు వెళ్లారు. తిరిగి ఈనెల 21న రాత్రి ఇంటికి చేరుకోగా ప్రధాన ద్వారం తలుపులు, తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాను పగులగొట్టి వస్తువులు, చీరలు చిందరవరగా పడవేశారు. బీరువాలో ఉన్న రెండు బంగారు నల్లపుసల గొలుసు, అర తులం బంగారు చెవు కమ్మలు, రెండు వెండి గిన్నెలు, రెండు వెండి చెంచాలతో పాటు రూ.6,300



ఎంపీడీఓ ఇంట్లో చిందరవందరగా ఉన్న వస్తువులు

చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ విషయంపై ఎంపీడీఓ శంకరయ్య మంగళవారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనాస్థలాన్ని పరిశీలించి ఎంపీడీఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పచ్చిపాల పరమేష్ తెలిపారు.

దంపతుల పంచాయితీ.. రౌడీ మూకల దాడి

- ఒకరికి తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం

నడిగూడెం : దంపతుల పంచాయితీ చినికి చినికి గాలి వానలా మారి చివరికి ఓ వ్యక్తి ప్రాణాల మీదకు తెచ్చింది. నడిగూడెం మండల కేంద్రంలో చోటు చేసుకున్న ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నడిగూడేనికి చెందిన గుంజ మురళికి తన భార్య నాగజ్యోతితో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఇదే క్రమంలో ఈ నెల 21న మురళి భార్యపై చేయి చేసుకోవడంతో చేతికున్న గాజు పగిలి గాయమైంది. విషయాన్ని ఆమె తమ సమీప బంధువు పల్లపు శ్రీను ఇంటికి వెళ్లి చెప్పింది. అనంతరం శ్రీను తన తల్లిదండ్రులతో పాటు ఖమ్మంలో ఉంటున్న బావమరిది దేవ్షళ్ల వీరబాబుకు గొడవ విషయం చెప్పాడు. దీంతో వీరబాబు మూడు కార్లలో పది మంది రౌడీ మూకలను నడిగూడేనికి తీసుకొచ్చాడు. అందరూ కలిసి నాగజ్యోతి భర్త మురళితో పాటు మరిది యల్లయ్య, అత్త అచ్చమ్మపై దాడి చేశారు. ఈ దాడిలో యల్లయ్యకు తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న యల్లయ్య

కాగా సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఖమ్మంలో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. మురళి తల్లి అచ్చమ్మ ఫిర్యాదు మేరకు పల్లపు శ్రీను, వీరబాబుతో పాటు మరో పది మందిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు.

రూ.1.11 లక్షల నగదు పట్టివేత

హుజూర్‌నగర్ : ఎన్నికల విధులపై అధికారులకు శిక్షణ ఇస్తున్న సమయంలో బయటి వ్యక్తి వద్ద ఉన్న రూ.1.11లక్షలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. హుజూర్‌నగర్‌లోని వీపీఎం స్కూల్లో బుధవారం పీఓ, ఏపీఓ అధికారులకు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ కేంద్ర వద్ద సూర్యాపేటకు చెందిన సతీష్ రూ 1.11లక్షలతో పట్టుపడ్డాడు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీం లీడర్ శంకర్, అధికారులు ఆ డబ్బులను స్వాధీనం చేసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా గొంతుక అవుతా.. ఆశీర్వదించండి

పాలకవీడు : తనను గెలిపించి చట్టసభలకు పంపితే ప్రజా గొంతుక అవుతానని, ప్రజలు ఆశీర్వదించాలని హుజూర్‌నగర్ నియోజకవర్గ సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థి మల్లు లక్ష్మి కోరారు. బుధవారం ఆమె మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల నిరంతరం పోరాడేది సీపీఎం పార్టీ ఒక్కటేనన్నారు. చట్ట సభల్లో ఎర్రజెండా ప్రాతినిధ్యం లేకపోతే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందన్నారు. గతంలో సీపీఎం పార్టీ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా ఉన్న సమయంలో జరిగిన అభివృద్ధి నేటికీ కళ్లకు కనబడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి అనంతప్రకాష్, యాదగిరిరావు, దొంగల వెంకటయ్య, పగడాల మట్టేష్, పారేపల్లి శేఖర్‌రావు, డీవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రమేష్, శ్రీకాంత్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, ధనమూర్తి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

నారసింహుడి నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీచెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేకార్చనలు, మూలవిరాట్‌మూర్తికి, పంచామృతాభిషేకం, ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. అనంతరం స్వామిఅమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో అలంకరించి కల్యాణ ఘట్టాన్ని పూర్తి చేశారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని క్షేత్రంలో గల శ్రీపార్వతీ రామలింగేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ మహారుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు ఉన్నారు.

శ్రీనివాసరెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలి

మునగాల : మండలంలోని నర్సింహులగూడెం గ్రామానికి చెందిన డీవైఎఫ్ఐ నాయకుడు బొంత శ్రీనివాసరెడ్డి 16వ వర్ధంతి వేడుకలను బుధవారం ఆయన స్వగ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి స్మారక స్థూపం వద్ద సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బుర్రి శ్రీరాములు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శ్రీరాములు మాట్లాడుతూ శ్రీనివాసరెడ్డి ఆశయసాధనకు ప్రతి కార్యకర్త కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తాడువాయి సింగిల్ విండో మాజీ చైర్మన్ బొంత విజయలక్ష్మి, మాజీ సర్పంచ్ జూలకంటి కొండారెడ్డి, సీపీఎం నాయకులు నందిపాటి శ్రీరాములు, మారం వెంకటరెడ్డి, మెంతబోయిన వీరస్వామి, ఉయ్యాల కొండయ్య, సొంపంగు శరబంధి, మారం ఉదయమ్మ, రాచకొండ మంగతాయి పాల్గొన్నారు.

శ్రీనివాసరెడ్డికి నివాళి

నడిగూడెం : మండల కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో సీపీఎం నాయకుడు, తాడువాయి సహకార సంఘం చైర్మన్, దివంగత బొంత శ్రీనివాసరెడ్డి 17వ వర్ధంతి కార్యక్రమాన్ని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాసాని కిషోర్, మండల అధ్యక్షుడు జమ్మి యల్లయ్య, నాయకులు కొరట్ల బ్రహ్మయ్య, కాసాని వినోద్, ప్రవీణ్, సైదులు, రామయ్య పాల్గొన్నారు.



మునగాల : శ్రీనివాసరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బుర్రి శ్రీరాములు, నాయకులు

బీఆర్‌ఎస్‌ను పారదోలాలి

హుజూర్‌నగర్‌రూరల్ : రాష్ట్రంలో అవినీతి పాలనలో మునిగిపోయిన బీఆర్‌ఎస్ పార్టీని పారదోలాలని టీపీసీసీ వ్యూహ, ప్రణాళిక కమిటీ సలహాదారు, ఎన్ఆర్ఐ సాముల జైపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం అమరవరంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చక్కెర వీరారెడ్డితో కలిసి ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కర్నాటి వీరనాగిరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఉస్తెల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గురవారెడ్డి, నర్సిరెడ్డి, ఎస్‌కె రజాక్, సైదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.